సాక్షి సూర్యాపేట

శుక్రవారం । 15 । మార్చి । 2024



కల్లు తయారీ మందు పట్టివేత

కల్లు తయారీ మందును కారులో తరలిస్తుండగా కట్టంగూర్ అండర్‌పాస్ సమీపంలో ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. - IIలో



భార్యాభర్తల అరెస్ట్

ప్రయాణికులను కారులో ఎక్కించుకొని దోపిడీలకు పాల్పడుతున్న భార్యాభర్తలను పోలీసులు అరెస్టు చేశారు. - IVలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-31 (శుక్రవారం సా॥)

సహర్ 5-02 (శనివారం ఉ॥)

న్యూస్‌రీల్

భూగర్భ, గనుల శాఖలో బదిలీలు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: భూగర్భ, గనుల శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురు అధికారులు, సిబ్బందిని ప్రభుత్వం బదిలీ చేసింది. ఈమేరకు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి బెన్హర్ మహేష్ దత్ ఎక్కా గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనూ పలువురు బదిలీ అయ్యారు. మహబూబాబాద్‌లో ఏడీగా ఉన్న (ఆరోగ్య కారణాల రీత్యా గతేడాది ఆగస్టు 14న నల్లగొండలో రిపోర్టు చేసిన) జి.రఘునందన్‌రెడ్డిని సూర్యాపేటకు, యాదాద్రి భువనగిరి ఏడీగా ఉన్న ఎ.వెంకటరమణను మహబూబాబాద్‌కు, వికారాబాద్‌లో ఏడీగా ఉన్న టి.సామ్యూల్ జాకబ్‌ను నల్లగొండ ఏడీగా, సిద్దిపేట ఏడీగా ఉన్న కె.రాఘవరెడ్డిని యాదాద్రి భువనగిరి ఏడీగా బదిలీ చేశారు. సూర్యాపేట ఏడీగా హెడ్ ఆఫీస్‌లో డిప్యూటేషన్‌పై ఉన్న స్వామికృష్ణాజీరావును హెడ్ ఆఫీస్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా అసిస్టెంట్ జియాలిస్టుల్లో.. యాదాద్రిలో ఉన్న ఇ.లక్ష్మీప్రసాద్‌ను నిర్మల్‌కు, నల్లగొండలో ఉన్న పి.వెంకటేశ్వర్‌రావును కరీంగనర్‌కు, సూర్యాపేటలో ఉన్న బి.వెంకటరమణను గద్వాలకు, మంచిర్యాలలో ఉన్న ఆర్.బాలును నల్లగొండకు బదిలీ చేశారు. రాయల్టీ ఇన్‌స్పెక్టర్లలో సూర్యాపేటలో ఉన్న పి.కృష్ణంరాజును డీడీఎంజీ హైదరాబాద్‌కు, యాదాద్రిలో ఉన్న కె.అనితను జనగామకు, నల్లగొండలో ఉన్న నాగమణిని మేడ్చల్ మల్కాజిగిరికి బదిలీ చేశారు.

నేటి నుంచి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నుంచి టీకాలు వేయనున్నట్లు కలెక్టర్ వెంకటరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 14 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 3,85,000 పశువులకు టీకాలు వేయడం జరుగుతుందని తెలిపారు.

గిట్టుబాటు ధర కల్పించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద మాస్‌లైన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా సభ్యుడు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్ల నాగయ్య, అరుణోదయ జిల్లా కన్వీనర్ నర్సయ్య, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు చంద్రకళ, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



రికార్డులు పరిశీలిస్తున్న కళ్యాణ చక్రవర్తి

మునగాల(కోదాడ): అధిక రక్తపోటు, మధుమేహం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహించే ఉచిత రక్తపరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డా.కళ్యాణచక్రవర్తి కోరారు. గురువారం మునగాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన సందర్శించి, రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డా.రవీందర్, స్టాఫ్ నర్సులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

భానుపురి (సూర్యాపేట) : ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో వద్ద వెన్నెల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు, సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆస్పత్రి జనరల్, ఛాతి వైద్య నిపుణుడు నరేష్, ఆర్టీసీ డిపో మేనేజర్ సురేందర్, వెన్నెల ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ బయ్య దయాకర్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

వటపత్రశయనుడై.. హంస వాహనంపై విహరించి



యాదాద్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం వటపత్రశాయి అలంకారాన్ని ప్రధానాలయ మాడ వీధుల్లో ఊరేగిస్తున్న అర్చకులు



రాత్రి హంస వాహనంపై దర్శనమిచ్చిన నృసింహుడు

వడ్డీలేని రుణం మహిళలకు వరం

- మహిళా సంఘాలకు జీరో వడ్డీ రుణాలు అందించాలని ప్రభుత్వ నిర్ణయం
- వెలువడాల్సి ఉన్న విధివిధానాలు
- జిల్లాలో 2.31లక్షల మంది మహిళలకు లబ్ధి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ లేని రుణాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వంద శాతం వడ్డీ రాయితీ రుణం పథకాన్ని గత ప్రభుత్వం అమలు చేసినా మహిళలకు వడ్డీ చెల్లించడంలో విఫలమైంది. ఉమ్మడి రాష్ట్రంలో మహిళా సంఘాల సభ్యులకు పావలా వడ్డీకి బ్యాంకు లింకేజీ రుణాలు అందించేవారు. బ్యాంకులు నిర్దేశించిన లెక్క ప్రకారం మహిళలు వడ్డీ, అసలు చెల్లిస్తే రాష్ట్ర ప్రభుత్వం 75 శాతం వడ్డీని రీయింబర్స్‌మెంట్ రూపంలో తిరిగి ఇచ్చేది. అయితే బీఆర్‌ఎస్ హయాంలో కేవలం రెండుసార్లు మాత్రమే వడ్డీ బకాయిలు ఇచ్చారు. వడ్డీ బకాయిలు పేరుకుపోయినా మహిళలకు నామమాత్రంగానే రాయితీ సొమ్ము చేతికి అందింది. కాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది నుంచి జీరో వడ్డీ రుణాలను పక్కాగా అందించాలని నిర్ణయించింది. దీంతో మహిళా సంఘాలపై ఆర్థికభారం తగ్గనుంది.

జిల్లాలో 23,124 మహిళా సంఘాలు

జిల్లాలోని 23 మండలాల పరిధిలో 17,735 మహిళా సంఘాలు, 5 మున్సిపాలిటీల్లో 5,389 మహిళా సంఘాలు ఉన్నాయి. వీటిలో సుమారు 2.31లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. వివిధ ప్రభుత్వ పనుల్లో మహిళా సంఘాల సభ్యులను భాగస్వాములను చేయడానికి చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫాం కుట్టే పనిని స్వయం సహాయక సంఘాలకు అప్పగించింది. ప్రభుత్వ రుణాలతో చిన్నతరహా మిల్లులు, చిరుధాన్యాలతో తినుబండారాల తయారీ వంటి పరిశ్రమలు నెలకొల్పి మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధి రంగంలో రాణిస్తున్నారు. వారిని మరింత ప్రోత్సహించేందుకు వడ్డీ లేని రుణాలు ఉపయోగపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.



రూ.5లక్షల బీమాతో ధీమా

గతంలో మహిళా సంఘాల సభ్యులకు అభయహస్తం, జనశ్రీ లాంటి పథకాలతో బీమా వర్తించేది. ఎలాంటి కారణాలతోనైనా సభ్యురాలు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.30వేలు అందేవి. ఆ తర్వాత పథకాలు రద్దయ్యాయి. రైతు బీమా మాదిరిగా స్వయం సహాయక సంఘాల సభ్యులకూ రూ.5 లక్షల బీమా సదుపాయం కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. ప్రీమియం సొమ్మునూ చెల్లించనుంది. జిల్లాలో 60 సంవత్సరాల వయస్సు లోబడిన సంఘాల సభ్యులకు లబ్ధి చేకూరనుంది.

డిసెంబర్ నుంచే అమలు

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన డిసెంబర్ మాసం నుంచి మహిళా సంఘాలు తీసుకున్న రుణాలకు ప్రభుత్వమే వడ్డీ చెల్లించనున్నట్లు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఇటీవల ప్రకటించారు. విధివిధానాలు వెలువడాల్సి ఉంది. గతంలో తీసుకున్న రుణాలను వడ్డీతో సహా నెలవారీగా సభ్యులు చెల్లించేవారు. ఆరు నెలలకోసారి ప్రభుత్వం బ్యాంకులకు వడ్డీ సొమ్ము అందించేది. మహిళా సంఘాల నుంచి వసూలైన వడ్డీని తిరిగి ఆయా సంఘాల ఖాతాల్లో బ్యాంకులు జమచేసేవి. ఇప్పుడు కూడా ఇలాంటి విధానాన్నే అనుసరిస్తారా? లేక కొత్త పద్ధతి ప్రవేశపెడతారా అనేది చూడాలి.

మరోసారి టెట్

- మే 20 నుంచి జూన్ 3వ తేదీ మధ్యలో పరీక్షలు
- ఉమ్మడి జిల్లాలో ఈసారి టెట్ రాసేవారి సంఖ్య 60 వేలు
- అందులో అర్హత సాధించిన వారికి డీఎస్సీ రాసే అవకాశం
- ఇప్పటికే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన విద్యాశాఖ
- డీఎస్సీ దరఖాస్తుల గడువు జూన్ 20 వరకు పెంపు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణకు విద్యాశాఖ గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. మే 20వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ మధ్యలో పరీక్ష నిర్వహించనుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో దాదాపు 60 వేల మంది కొత్త అభ్యర్థులు టెట్‌కు హాజరయ్యే అవకాశం ఉంది. గతేడాది సెప్టెంబరు 15న నిర్వహించిన టెట్ కోసం దరఖాస్తు చేసుకున్నా.. అందులో అర్హత సాధించని వారే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40 వేల మంది ఉన్నట్లు విద్యాశాఖ లెక్కలు చెబుతున్నాయి. అందులో అర్హత సాధించని వారే ఉమ్మడి జిల్లాలో 40 వేల మంది, ఈ ఏడాది డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎడ్), బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఎడ్) పూర్తి చేయబోయే వారు, గతంలో ఆయా కోర్సులు పూర్తి చేసినా టెట్ టెట్ రాయని వారు కలుపుకొని మొత్తం 60 వేల మంది అభ్యర్థులు మే 20 నుంచి జూన్ 3వ తేదీ మధ్యలో నిర్వహించబోయే టెట్‌కు హాజరు కానున్నారు. టెట్‌కు సంబంధించిన పూర్తిస్థాయి నోటిఫికేషన్‌ను విద్యాశాఖ ఈ నెల 20న వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనుంది. ఈ నెల 27నుంచి వచ్చే నెల 10వ తేదీవరకు దరఖాస్తుల ప్రక్రియ (ఫీజు చెల్లింపు, ఆన్‌లైన్ సబ్మిషన్) చేపట్టనుంది. ఈసారి టెట్‌కు నల్లగొండ జిల్లా నుంచే పేపరు-1, పేపరు-2కు దాదాపు 30 వేల మంది హాజరయ్యే అవకాశం ఉండగా, సూర్యాపేట నుంచి 20 వేల మంది, యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి దాదాపు 10 వేల మంది హాజరయ్యే అవకాశం ఉంది.

ఇప్పటికే డీఎస్సీ నోటిఫికేషన్

ఇక రాష్ట్ర వ్యాప్తంగా 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి విద్యాశాఖ గత నెల 29వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయగా, వాటి దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 4వ తేదీ నుంచి ప్రారంభమైంది. ఆ గడువు వచ్చే నెల 3వ తేదీతో ముగియనుండగా, దానిని జూన్ 20వ తేదీ వరకు విద్యాశాఖ పొడగించింది. ఆన్‌లైన్ పరీక్షలను జూలై 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించేలా తాత్కాలిక పరీక్ష తేదీలను గురువారం ప్రకటించింది. దీనిద్వారా నల్లగొండలో 605, సూర్యాపేట 386, యాదాద్రి 277 కలిపి మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 1268 పోస్టులను భర్తీ చేయనుంది. ఉమ్మడి జిల్లా నుంచి ప్రస్తుతం టెట్ రాయబోయే 60 వేల మందిలో అర్హత సాధించిన వారితోపాటు 2011 నుంచి నిర్వహించిన టెట్‌లలో అర్హత సాధించిన వారు మరో లక్షన్నర మంది ఉపాధ్యాయ నియామకాల పరీక్ష డీఎస్సీకి హాజరు కానున్నారు.

ఎదుటి వారికి డబ్బు ఇచ్చిందెవరు?

- హాట్ టాపిక్‌గా మారిన హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే సైదిరెడ్డి ఆడియో

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను ఓడించేందుకు సొంత పార్టీ నేతలే ప్రయత్నం చేశారా.. అంటే అవునని అంటున్నారు హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు డబ్బులు ఇస్తామని చివరి రోజు వరకు చెప్పి ఇవ్వకుండా, ఎదుటి పార్టీ వారికి డబ్బులు ఇచ్చారంటూ ఆయన చేసిన విమర్శలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. సొంత పార్టీ వారినే ఓడించేందుకు అలా చేశారని పరోక్షంగా ఆయన విమర్శించడం బీఆర్‌ఎస్‌లోనూ చర్చనీయాంశంగా మారింది. తన అనుచరులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ఆడియో వైరల్‌గా మారింది. అసలు బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులను ఓడించేందుకు ఎదుటి పార్టీ అభ్యర్థికి డబ్బులు ఇచ్చిందెవరు? అసలు ఎందుకు అలా చేయాల్సి వచ్చిందనే విషయాలను ఆయన పూర్తిగా వెల్లడించకపోయినా ఆయన చేసిన విమర్శలు చర్చనీయాంశంగా మారాయి. దీంతో పలువురు మాజీ ఎమ్మెల్యేలు తమ ఓటమికి కారణాలేంటి? తమ విషయంలోనూ అలా జరిగిందా? అనే ఆలోచనల్లో పడ్డారు. మొత్తానికి శానంపూడి సైదిరెడ్డి ఆడియో టేపులు జిల్లాలో పెద్ద దుమారమే రేపాయి. ప్రస్తుతం బీఆర్ఎస్ నుంచి చాలా మంది వెళ్లిపోతున్నారని, బీఆర్‌ఎస్‌లో పోటీ అంటేనే నేతలు భయపడి పోతున్నారని, రంజిత్‌రెడ్డి, పైళ్ల శేఖర్ రెడ్డి కూడా పోటీ చేయడం లేదని పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది.

నేటి నుంచి ఒంటిపూట బడులు

- ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు నిర్వహణ

సూర్యాపేటటౌన్: ఎండలు పెరగడంతో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రభుత్వం ఒంటిపూట బడులు నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు శుక్రవారం నుంచి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మధ్యాహ్నం వరకే నిర్వహించనున్నారు. ఉదయం 8గంటలకు తరగతులు ప్రారంభమై మధ్యాహ్నం 12.30గంటల వరకు ముగియనున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం 12.30గంటలకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తారు.

జిల్లాలో 950 పాఠశాలలు..

జిల్లాలో 950 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 70వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఉదయం 7.45గంటలకు మొదటి గంట మోగించాల్సి ఉంటుంది. ప్రార్థన ఉదయం 7.50కి ప్రారంభమై 8గంటల వరకు ఉంటుంది. 8గంటల నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. అయితే సోమవారం నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానుండంతో జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 67 పరీక్ష కేంద్రాల్లో మాత్రం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు కొనసాగుతాయి. పరీక్షలు ముగిసే వరకు ఇదే షెడ్యూల్ పాటించాల్సి ఉంటుందని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు.



నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

జిల్లాలోని అన్ని పాఠశాలలు కచ్చితంగా ఒంటిపూట తరగతులు నిర్వహించాలి. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. అదనపు తరగతులు నిర్వహించినా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

– అశోక్, డీఈఓ



హుజూర్‌నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ ప్రసాద్, చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

ప్రజా సంక్షేమం దిశగా అడుగులు

- రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్
- మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సింగిల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

హుజూర్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, ప్రజా సంక్షేమం దిశగా అడుగులు వేస్తోందని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని ఫణిగిరి గుట్ట వద్ద రూ.74.80 కోట్లతో 2,160 సింగిల్ బెడ్‌రూం ఇళ్ల పునర్నిర్మాణ పైలాన్, రూ.50లక్షలతో చేపట్టిన క్రిస్టియన్ శ్మశాన వాటిక, రూ.కోటితో టౌన్ హాల్ అభివృద్ధి పనులకు మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ మాట్లాడుతూ.. తుది దశ నిర్మాణంలో ఉన్న హౌసింగ్ కాలనీ ఆరు నెలల్లో పూర్తి చేసి నిరుపేదలకు అందిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముందుగా హుజూర్‌నగర్‌లో హౌసింగ్ కాలనీ పరిశీలించి తుది దశలో ఉన్న ఇళ్లకు సత్వరమే రూ. 74.80 కోట్లు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తదుపరి 90 రోజులలోపు 31 వేల ఉద్యోగాలు ఇచ్చామని, 2008లో డీఎస్‌సీ చేసిన వారికి త్వరలో ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ కాలనీని పూర్తి చేస్తే తనకు పేరు వస్తుందన్న అక్కసుతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లగా ఈ కాలనీ పనులు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. తొలుత ఆటో డ్రైవర్లకు దక్షత ఫౌండేషన్ ద్వారా ఇన్సూరెన్స్ పత్రాలు కోదాడ, హుజూర్‌నగర్ ఆటో డ్రైవర్లకు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకటరావ్, ఎస్పీ రాహుల్ హెగ్డే, హౌసింగ్ ఎస్సీ రవీంద్ర రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డి, ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, తన్నీరు మల్లిఖార్జునరావు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి హామీ నెరవేరుస్తాం : ఉత్తమ్

పాలకవీడు: కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. పాలకవీడు మండలంలోని బెట్టితండా వద్ద మూసీ నదిపై రూ.33.83కోట్లతో నిర్మించనున్న సాగునీటి లిఫ్ట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ద్వారా బెట్టితండా, పాఢ్యాతండా, సజ్జాపురం గ్రామాల్లో 2041 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని టేలాండ్ భూములన్నింటికీ సాగునీరు అందిస్తానన్నారు. కాల్వల పునరుద్ధరణ, లిఫ్టల మరమ్మతులు, కొత్త లిఫ్టల మంజూరుతో సాగు విస్తీర్ణం పెరుగుతుందని చెప్పారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకం ద్వారా హుజూర్‌నగర్ నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. స్థానిక జెడ్పీటీసీ కోరిక మేరకు గిరిజనులు ఎక్కువగా ఉండే ప్రాంతం కావడంతో అదనంగా ఇళ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

అంతకుముందు స్థానిక ఎంపీపీ భూక్యా గోపాల్, జెడ్పీటీసీ మాలోతు బుజ్జిమోతీలాల్ ఆధ్వర్యంలో మంత్రులకు, అసెంబ్లీ స్పీకర్‌కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లత, ఎస్పీ రాహుల్ హెగ్డే, జలవనరులశాఖ అధికారులు సీఈ రమేష్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సూర్యాపేట జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగేంధర్, ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ శ్రీదేవి, ఇరిగేషన్ డీఈ అమరేందర్‌రెడ్డి, నాయకులు శివారెడ్డి, నేరేడుచర్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, నాగిరెడ్డి, బెల్లంకొండ నరసింహారావు, శేషురెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ సెకండియర్ పరీక్షలు



పరీక్షలు ముగిసిన ఆనందంలో విద్యార్థినులు

- ఇంటిబాట పట్టిన విద్యార్థులు

ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షలు గురువారం ముగిసాయి. దీంతో హాస్టళ్లలో ఉండే విద్యార్థులు ఇంటిబాట పట్టారు. కాగా.. జనరల్ విభాగానికి సంబంధించి మొత్తం 6,002 మంది విద్యార్థులకు 5,790 మంది విద్యార్థులు హాజరయ్యారని, 212 మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ కృష్ణయ్య తెలిపారు. ఒకేషనల్ విభాగానికి సంబంధించి 1,220 మంది విద్యార్థులకు 1,123 మంది విద్యార్థులు హాజరుకాగా.. 97 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈఓ పేర్కొన్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట



తల్లితో కలిసి ఇంటికి వెళ్తున్న విద్యార్థిని

వైద్య పరీక్ష.. ఆరోగ్యానికి రక్ష

- అందుబాటులోకి 87 రకాల టెస్టులు
- పీహెచ్‌సీల్లో శాంపిళ్ల సేకరణ
- జిల్లా కేంద్రంలో రోగ నిర్ధారణ
- ఒక్క రోజులోనే రిపోర్టు అందజేత

తిరుమలగిరి (తుంగతుర్తి): గ్రామీణ ప్రజలకు వైద్య సేవలను చేరువ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా 87 రకాల పరీక్షలను అందుబాటులోకి తెచ్చింది. ఇందులో భాగంగా అధునాతనమైన పరికరాలతో జిల్లా కేంద్రంలో తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ పేరుతో రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని (టీహబ్ సెంటర్) ఏర్పాటు చేశారు. ఇందులో పీహెచ్‌సీ నుంచి వచ్చిన శాంపిళ్లతోపాటు అక్కడికి వచ్చిన వారిని పరీక్షించి ఫలితాలు వెల్లడిస్తున్నారు.

పరీక్షల వివరాలు ఇలా..

నెల	రోగులు	సేకరించిన రక్తనమూనాలు	చేసిన పరీక్షలు
జనవరి	9178	18,117	33,087
ఫిబ్రవరి	9,868	19,548	34,999



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త నమూనాలను సేకరిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లు

24 గంటల్లోనే ఫలితాల రిపోర్టు

24 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 4 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 2 సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. గతంలో ఆరోగ్య కేంద్రాలలో కేవలం రక్త నమూనాలను సేకరించి కొన్ని పరీక్షలు మాత్రమే చేసేవారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలో రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రాన్ని ప్రారంభించి 87 రకాల పరీక్షలు చేస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రక్త నమూనాలను సేకరించి జిల్లా కేంద్రానికి పంపిస్తారు. అన్నిరకాల పరీక్షలు పరీక్షించి 24 గంటల్లో సంబంధిత వ్యక్తి సెల్‌ఫోన్ నంబర్‌కు, ఆసుపత్రులకు కూడా రిపోర్టు వివరాలు పంపిస్తున్నారు. ఉచితంగా చేస్తున్న రోగ నిర్ధారణ పరీక్షల వల్ల తమకు ఆర్థికంగా ఎంతో వెసులుబాటు కలుగుతోందని గ్రామీణ ప్రజలు అంటున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



వైద్యుల సూచన మేరకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రక్త నమూనాలను సేకరించి జిల్లా కేంద్రానికి పంపిస్తారు. ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందుతున్న ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా నోడల్ అధికారి, తెలంగాణ డయాగ్నోస్టిక్స్ విభాగం

క్లుప్తంగా

హుండీలకు బట్టలు తొలగింపు


క్యూలైన్‌లో హుండీలకు తొలగించిన బట్టలు

సాక్షి ఎఫెక్ట్..

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ ముఖ మండపంలోని హుండీలకు కట్టిన బట్టలను ఆలయాధికారులు గురువారం తొలగించారు. సాక్షి దినపత్రికలో గురువారం 'హుండీలకు బట్టలు' శీర్షికన ప్రచురితమైన వార్తతో అప్రమత్తమైన అధికారులు హుండీలకు కట్టిన బట్టలను తొలగించారు. నిండిన హుండీల్లోని కానుకలను సంచుల్లో నింపి స్ట్రాంగ్ రూమ్‌లో పెట్టారు.

గుప్తనిధుల కలకలం

చందంపేట: మండలంలోని బుడ్డోనితండా గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకట్‌నాయక్ తండాలో బుధవారం రాత్రి గుప్తనిధుల కోసం కొందరు వ్యక్తులు వచ్చినట్లు తండావాసులు చెబుతున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్రియాల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు, వారి బంధువులతో కలిసి వెంకట్‌నాయక్ తండా సమీపంలోని పురాతనమైన ఆంజనేయ స్వామి గుడి వద్ద బుధవారం రాత్రి 9గంటల సమయంలో కారు, రెండు బైక్‌లపై అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో తండావాసులకు వారిపై అనుమానం వచ్చింది. గుప్తనిధులు కోసమే ఇక్కడ తిరుగుతున్నారని భావించి వారిని ప్రశ్నిస్తుండగానే కారు, బైక్‌లను వదిలి పరారయ్యారు. తండావాసులు వెంబడించి ఇద్దరిని పట్టుకుని, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పట్టుబడిన వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా.. తాము కల్లు తాగటానికి వెళ్లామని, ఒకేసారి చాలామంది రావడంతో భయంతో అక్కడినుంచి పరుగు తీశామని చెప్పినట్లు తెలిసింది.

పిల్లలను బెదిరించిన వ్యక్తి అరెస్ట్

భువనగిరి క్రైమ్: భువనగిరి పట్టణంలోని మదర్ థెరిస్సా స్కూల్ వద్ద గురువారం పిల్ల లను బాంబ్ ఉందంటూ బెదిరించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు.. సదరు వ్యక్తి బ్యాగుతో వచ్చి అందులో బాంబ్ ఉందని పిల్లలను భయపెట్టాడు. ఆ బాంబు ఐదు కిలోమీటర్ల వరకు బ్లాస్ట్ అవుతుందని చెప్పి భయభ్రాంతులకు గురిచేశాడు. పిల్లల ద్వారా విషయం తెలుసుకున్న స్కూల్ ప్రిన్సిపాల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అతడిని అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. కాగా సదరు వ్యక్తిపై పిల్లల తల్లిదండ్రులు దాడి చేశారు. అతడి వద్ద లభించిన ఆధార్ కార్డులో శ్రీనివాస్, కరీంనగర్ అని ఉందని, అతడు మతిస్థిమితం కోల్పోయినట్లు పోలీసులు భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మోతె: మండలంలోని గోల్‌తండాకు చెందిన భూక్య బాలాజీ(32) బుధవారం సాయంత్రం బైక్‌పై మోతె మండల కేంద్రానికి వెళ్తుండగా.. హుస్సేన్‌బాద్ గ్రామ శివారులో రోడ్డు దాటుతుండగా ఖమ్మం వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బాలాజీ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

వటపత్రశాయిగా, హంస వాహన సేవలో..


తూర్పు మాడ వీధిలో వటపత్రశాయి అలంకార సేవ ముందు పారాయణం పఠిస్తున్న ఆచార్యులు


హంస వాహనంపై మాడ వీధిలో ఊరేగుతున్న స్వామివారు

- భక్తులకు దర్శనమిచ్చిన యాదాద్రీశుడు
- నాల్గవ రోజుకు చేరిన వార్షిక బ్రహ్మోత్సవాలు
- నేడు ఉదయం శ్రీకృష్ణాలంకార సేవ, సాయంత్రం పొన్న వాహన సేవ

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన గురువారం ఉదయం స్వామివారు వటపత్రశాయి అలంకార సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రధానాలయంలో వేకువజామునే నిత్యారాధనలు, నిత్య పూజల అనంతరం ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు పారాయణీకులు వేద పారాయణం పఠించారు. అనంతరం స్వామి వారిని వటపత్రశాయి అలంకారములో ప్రత్యేక పల్లకీపై అధిష్ఠించి ఆలయ తిరు మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం తూర్పు రాజగోపురం మాడ వీధిలో వటపత్రశాయిగా అలంకరించిన స్వామి సేవను ప్రత్యేక బల్లపై అధిష్ఠించి ఆరాధించారు. ఈ వేడుకలో ఆలయ ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఆచార్యులు, పారాయణీకులు, రుత్వికులు, ఆలయ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

సాయంత్రం హంస వాహనంపై..

సాయంత్రం ఆలయంలో నిత్యాఆరాధనల అనంతరం స్వామివారిని హంస వాహన సేవలో అలంకరించి ఊరేగించారు. దక్షిణ దిశలోని ప్రథమ ప్రాకారం నుంచి ప్రారంభమైన హంస వాహన సేవ పడమటి రాజగోపురం నుంచి ఉత్తరం, తూర్పు, దక్షిణ రాజగోపురాల ముందు నుంచి సాగింది. తూర్పు మాడ వీధిలో స్వామి సేవను అధిష్ఠించి ఆచార్యులు వేదమంత్రాలను పఠించారు.

నేడు శ్రీకృష్ణాలంకారంలో..

స్వామి వారికి శుక్రవారం ఉదయం శ్రీకృష్ణాలంకారణ(మురళీ కృష్ణుడు) సేవ, సాయంత్రం పొన్న వాహన సేవ నిర్వహిస్తారు.

యాదాద్రిలో నిత్యారాధనలు..

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం సంప్రదాయ పూజలు నిర్వహించారు. వేకువజామునే తెరచిన ఆచార్యులు స్వామి, అమ్మవార్లకు సుప్రభాతం నిర్వహించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన చేపట్టారు. ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తుల చెంత అష్టోత్తర పూజలు జరిపించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఇలాచీ దండలు బహూకరణ..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 17న ఎదుర్కోలు మహోత్సవంలో, 18న స్వామివారి తిరు కల్యాణంలో వినియోగించేందుకు గాను మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని అల్వాల్‌కు చెందిన రామాంజనేయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఇలాచీ దండలు అందజేశారు. వాటితో పాటు స్వామివారి సేవలకు నీడ కోసం వినియోగించేందుకు గొడుగు, అలాగే దిండ్లు బహూకరించారు. వీటిని ట్రస్టు తరఫున లైవ్ లైన్ హెల్త్‌కేర్‌కు చెందిన డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఆలయ ఈఓ రామకృష్ణారావుకు అందజేశారు. 2 కిలోల ఇలాచీలతో మూడు దండలు చేయించినట్లు తెలిపారు. అంతకుముందు ఆయన స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.


ఇలాచీ దండలను ఈఓకు అందజేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

సిద్ధమవుతున్న కల్యాణ వేదిక

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 18వ తేదీన జరిగే స్వామివారి తిరు కల్యాణోత్సవానికి ఆలయ ఉత్తర మాడ వీధిలో రథశాల ముందు భారీ వేదికను అధికారులు సిద్ధం చేస్తున్నారు. కల్యాణ వేదిక ముందు సుమారు 6వేలకు పైగా భక్తులు కూర్చునేలా గ్యాలరీలను ఏర్పాటు చేస్తామని అధికారులు వెల్లడించారు. వీవీఐపీలు, వీఐపీలు, టిక్కెట్ కొనుగోలు చేసిన భక్తులు, మీడియా, సామాన్య భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొనేలా వేదిక ముందు గ్యాలరీలు ఉంటాయని చెప్పారు.


రథశాల ముందు కల్యాణ వేదికను సిద్ధం చేస్తున్న దృశ్యం

భక్తులు కల్యాణాన్ని వీక్షించేలా కొండ పైన ఏడు చోట్ల భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేయనున్నారు. అంతేకాకుండా శుక్రవారం ఉదయం నుంచి ఆలయ తూర్పు మాడ వీధిలో ధార్మిక, సాహిత్య, సంగీత మహాసభలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికారులు వేదికను సిద్ధం చేశారు. ఉదయం 9.30గంటలకు ఆస్థానం వారిచే మంగళవాయిద్యం, వైదిక ప్రార్థనలతో సాంస్కృతిక కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. 20వ తేదీన ముగియనున్నాయి. ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం భక్తి సంగీతం, కూచిపూడి, పేరణి నృత్యాలు, మంగళ వాయిద్య గోష్ఠి, చిందు యక్షగానం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వృద్ధ దంపతులను ఢీకొట్టిన కారు

- భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు

చింతపల్లి: టీవీఎస్ మోపెడ్‌పై రోడ్డు దాటుతున్న వృద్ధ దంపతులను కారు అతివేగంతో వచ్చి ఢీకొట్టడంతో భర్త మృతిచెందాడు. భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన చింతపల్లి మండల కేంద్రంలో హైదరాబాద్-నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై గురువారం సాయంత్రం జరిగింది. ఎస్‌ఐ యాదయ్య తెలిపిన ప్రకారం.. చింతపల్లి మండల పరిధిలోని హరిజ నాపురం గ్రామానికి చెందిన తంగెళ్ల లక్ష్మ య్య(65), అంజమ్మ దంపతులు గ్రామంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా రు. వీరికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. అందరి వివాహాలు చేశారు. గురువారం లక్ష్మయ్య, అంజమ్మ టీవీఎస్ మోపెడ్‌పై రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలంలో తమ బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరై తిరిగి వస్తున్నారు. మార్గమధ్యలో చింతపల్లి మండల కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్ వద్ద పెట్రోల్ పోయించుకునేందుకు హైదరాబాద్-నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిని దాటుతుండగా హైదరాబాద్ నుంచి వస్తున్న కారు అతివేగంతో వీరి టీవీఎస్ మోపెడ్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మయ్య అక్కికక్కడే మృతిచెందగా, అంజమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. కారు బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి లక్ష్మయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన అంజమ్మను 108 వాహనంలో హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

పెన్‌పహాడ్: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని నాగులపహాడ్ గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండల పరిధిలోని నారా యణగూడెం గ్రామానికి చెందిన నారాయణ లింగారెడ్డి(54) గురువారం రాత్రి నాగులపహాడ్‌లోని తన వ్యవసాయ పొలం వద్ద బోరు మోటారు పనిచేయకపోవడంతో చూసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆఫ్ చేస్తుండగా కరెంట్ తీగ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఎదురెదురుగా రెండు కార్లు ఢీ.. ఒకరు మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

మద్దిరాల (తుంగతుర్తి): మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఏఎస్‌ఐ నాగయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన అనంతరెడ్డి(35) తన మిత్రుడు కిరణ్‌తో కలిసి కారులో పని నిమిత్తం తుంగతుర్తికి వెళ్తున్నాడు. అదే సమయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం మద్రాస్‌తండాకు చెందిన సాయికుమార్ తన మిత్రుడితో కలిసి కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో రెండు కార్లు మద్దిరాల మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద 365వ నంబర్ జాతీయ రహదారిపై ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అనంతరెడ్డి తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతిచెందాడు. మరో కారులో ఉన్న సాయికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరకుని కార్లలో ఇరుక్కుపోయిన అనంతరెడ్డి మృతదేహాన్ని, సాయికుమార్‌ను బయటకు తీసే ప్రయత్నం చేశారు.


నుజ్జునుజ్జయిన కారు

గుర్తుతెలియని వాహనం ఢీ.. ఇద్దరికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

చివ్వెంల(సూర్యాపేట): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని బి. చందుపట్ల గ్రామ శివారులో సూర్యాపేట-ఖమ్మం రహదారిపై గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండలం నామవరం గ్రామానికి చెందిన కొత్త వెంకట్‌రెడ్డి, కొత్త భీష్మారెడ్డి బైక్‌పై సూర్యాపేట వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో బి.చందుపట్ల గ్రామ శివారులో సూర్యాపేట నుంచి ఖమ్మం వెళ్తున్న గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో క్షతగాత్రులను సూర్యాపేటకు తరలించారు. కాగా భీష్మారెడ్డి తలకు తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

పీడీఎస్ బియ్యం, ఇసుక ట్రాక్టర్ సీజ్

- రెండు కేసులు నమోదు

మఠంపల్లి: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం, ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మఠంపల్లి పోలీసులు గురువారం పట్టుకుని సీజ్ చేశారు. ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలంలోని గుండ్లపల్లికి చెందిన దవనం పద్మ ట్రాలీ వాహనం (ఏపీ 39 యూజీ 9896)లో 30క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా గురువారం తెల్లవారుజామున మఠంపల్లి సమీపంలో పోలీసులు పట్టుకున్నారు. కాగా నిందితురాలు, వాహనం నడిపే డ్రైవర్ పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అదే విధంగా మఠంపల్లి మండలంలోని చౌటపల్లికి చెందిన గుండెపంగు సైదులు తన ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు రెండు కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మామిడి తోట దగ్ధం

- సుమారు రూ.30 లక్షల నష్టం

ఆత్మకూరు(ఎం): మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామ రెవెన్యూ పరిధి పారుపల్లి-పల్లెపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద మామిడి తోట దగ్ధమైంది. ఈ ఘటన గురువారం ఉదయం వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గుండాల మండలం సుద్దాల గ్రామానికి చెందిన యామగాని మల్లయ్య, పిచ్చమ్మ భార్యాభర్తలు. పిచ్చమ్మ పేరున సుద్దాల గ్రామానికి సమీపంలో ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్‌పేట రెవెన్యూ పరిధి పారుపల్లి-పల్లెపహాడ్ క్రాస్ రోడ్డు వద్ద నాలుగు ఎకరాల మామిడి తోట ఉంది. ప్రస్తుతం తోట కాత దశలో ఉంది. యామగాని పిచ్చమ్మ, మల్లయ్య దంపతులు శుభకార్యం నిమిత్తం బుధవారం అడ్డగూడూరుకు వెళ్లారు. రాత్రి సమయంలో వారి మామిడి తోట దగ్ధమవుతూ కనిపించడంతో స్థానికులు గమనించి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ తోటలోని చెట్లు, కాత పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.30లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనపై విచారణ జరిపి తమను ఆదుకోవాలని బాధితులు తహసీల్దార్ వి. రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు.


కాలిపోయిన మామిడి చెట్లు

దొంగతనం కేసులో నిందితుడికి జైలుశిక్ష, జరిమానా

చివ్వెంల(సూర్యాపేట): దొంగతనం కేసులో నిందితుడికి ఏడాది జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ గురువారం తీర్పు వెలువరించారు. వివరాలు.. కోదాడ మండలం పాలారం గ్రామానికి చెందిన మట్టపల్లి సైదులు 2021 జూన్ 24న అదే మండలంలోని త్రిపురారం గ్రామంలో రైతు వేదిక ప్రారంభోత్సం ఉండటంతో చూడటానికి వెళ్లాడు. అక్కడ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా నందిగామ పట్టణానికి చెందిన దాసరి బాబ్జి అనే వ్యక్తి సైదులు ప్యాంట్ వెనుక జేబులో ఉన్న నగదు అపహరించాడు. ఇది గమనించిన పాలారం గ్రామానికి చెందిన మొక్క రమేష్ విషయాన్ని సైదులు చెప్పాడు. వెంటనే అప్రమత్తమైన సైదులు, రమేష్, మరో వ్యక్తి గుగులోతు శ్రీనివాస్ బాబ్జిని వెంబడించి పట్టుకున్నారు. అనంతరం కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. సైదులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ కేసు నమోదు చేసి నిందితుడిని జైలుకు పంపించారు. కేసు విచారణలో భాగంగా పలువురు సాక్షులను విచారించిన కోదాడ అడిషినల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ బి. ప్రియాంక్ నిందితుడికి ఏడాది జైలుశిక్షతో పాటు, రూ.500 జరిమాన విధిస్తూ అదే సంవత్సరం సెప్టెంబర్ 2న తీర్పు వెలువరించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ నిందితుడు జిల్లా కోర్టులో అప్పీల్ చేయగా.. గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొంపల్లి లింగయ్య వాదనలతో ఏకీభవిస్తూ కింది కోర్టు ఇచ్చిన తీర్పును యథావిధిగా అమలు చేస్తూ సంవత్సరం జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు లైజన్ ఆఫీసర్ సురేంద్రబాబు, కోర్టు కానిస్టేబుల్ రమణ సహకరించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

- అత్యాచారం చేసి హత్య చేసినట్లు భావిస్తున్న పోలీసులు
- దేవరకొండ పట్టణంలో వెలుగులోకి వచ్చిన ఘటన

కొండమల్లేపల్లి: దేవరకొండ పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపో సమీపంలో మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. దేవరకొండ సీఐ నరసింహులు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండలం గోనకోల్ గ్రామానికి చెందిన విభూతి శ్రీలత(38)కి నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునూతల మండలం పెనువెల్లి గ్రామానికి చెందిన విభూతి రాజుతో 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. శ్రీలత గత పది సంవత్సరాల నుంచి భర్తకు దూరంగా ఉంటూ ఒంటరిగా జీవిస్తోంది. కాగా గురువారం దేవరకొండ పట్టణంలోని ఆర్టీసీ బస్ డిపో సమీపంలో గల శేరిపల్లి అంతయ్య కాంప్లెక్స్ పైన శ్రీలత అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దేవరకొండ సీఐ వెంటనే ఘటనా స్థలానికి చేరకుని నల్లగొండ నుంచి డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి వివరాలు సేకరించారు. అయితే బుధవారం అర్ధరాత్రి కొందరు దుండగులు శ్రీలతపై అత్యాచారం చేసి గొంతు కోసి హత్య చేసినట్లు పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు పోలీసులు మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి తమ్ముడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు ఉండగా మేనమామ శ్రీను వద్ద ఉండి చదువుకుంటున్నట్లు సీఐ తెలిపారు.


శ్రీలత మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కట్టంగూర్‌లో కల్లు తయారీ మందు పట్టివేత

- ఇద్దరి అరెస్ట్

కట్టంగూర్: కల్లు తయారీ మందును కారులో తరలిస్తుండగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ బి. సంతోష్ ఆదేశాల మేరకు గురువారం కట్టంగూర్ అండర్‌పాస్ సమీపంలో ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా వనస్థలిపురానికి చెందిన ఎస్. నాగరాజు కట్టంగూర్‌కు చెందిన కిరాణం వ్యాపారి గంజి ఆంజనేయులుకు రెగ్యులర్‌గా కల్లు తయారీ మందును సరఫరా చేస్తున్నాడు. ఆంజనేయులు కల్తీ కల్లు మందును ఆర్డర్ ఇవ్వగా నాగరాజు హైదరాబాద్ నుంచి కట్టంగూర్‌కు కారులో కల్తీ మందును తరలిస్తూ గురువారం పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి 1.30 కేజీల డైజోఫామ్, కేజీ వైట్ కలర్ పౌడర్ బాక్స్, కేజీ చక్రీన్, కేజీ సిట్రిక్ యాసిడ్, 18 తెల్లరంగు బాటిళ్లు, రెండు సెల్‌ఫోన్లు, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన కల్తీ కల్లు మందు విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. నిందితులు ఆంజనేయులు, నాగరాజును రిమాండ్ తరలించినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నల్లగొండ సీఐ శ్రీని వాస్, ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ కిషన్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ రాకేష్, ఎస్‌ఐ గోపాల్‌రావు పాల్గొన్నారు.


పట్టుబడిన నిందితులను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

గాలికుంటు వ్యాధి నివారణకు స్పెషల్ డ్రైవ్

- నేటి నుంచి నెల రోజుల పాటు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు
- ఇప్పటికే మందులు, సామగ్రి అందజేత

పెద్దవూర: గేదెలు, తెల్లజాతి పశువులు, గొర్రెలు, మేకల యజమానులు గాలికుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. 15వ తేదీ నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు నెల రోజుల పాటు గ్రామాలలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయనున్నారు. మూడు నెలలలోపు, చూడి పశువులు మినహా మిగిలిన వాటన్నింటికి గ్రామాల వారీగా వెళ్లి టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమం కొనసాగుతుంది. ఈ వైరస్ ఎండాకాలంలో 14 రోజుల వరకు, చలికాలంలో నాలుగు వారాల వరకు జీవిస్తుంది. ఈ వ్యాధి సోకిన పశువుల నుంచి ఇతర పశువులకు గాలి ద్వారా, పశువుల పాకలో ఉపయోగించే పరికరాల కూడా వ్యాప్తి చెందుతుంది.

గాలికుంటు వ్యాధి లక్షణాలు

గాలికుంటు వ్యాధి సూక్ష్మాతిసూక్ష్మ క్రిముల (వైరస్) వల్ల వస్తుంది. 24 గంటల్లోగా చిక్కిపోయి అల్సర్‌కు గురవుతాయి. రెండు నుంచి ఆరు రోజుల వరకు జ్వర తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నోరు, పెదాలు, నాలుక, చన్నుల తో పాటు కాళ్ల గిట్టల మధ్య పుండ్లు వచ్చి అనతికాలంలోనే ఈ వ్యాధి వ్యాపిస్తోంది. ఈ వ్యాధి సోకిన పశువులు ఎప్పుడూ ముడుచుకుని పడుకుంటాయి. మేత, నీళ్ల సరిగా తీసుకోలేవు. నెమరు వేయలేవు. నోటి నుంచి సొంగ లేక నురగ కారుతుండటంతో పాటు బరువు తగ్గిపోతాయి. కాళ్ల మధ్యన పుండ్లు పడడం వలన సరిగ్గా నడవలేవు. పాల ఉత్పత్తి తగ్గిపోవడమే కాకుండా వ్యాధి నిరోధక శక్తి తగ్గి కొన్నిసార్లు పశువులు (ఎక్కువగా దూడలు) చనిపోయే అవకాశం ఉంటుంది. వ్యాధి సోకిన దూడలు 30 నుంచి 40 శాతం చనిపోతుంటాయి. మందుస్తు నివారణలో భాగంగా టీకాలు వేయించుకోవడమే ఉత్తమం. వ్యాధి సోకిన పశువుల పాలను తాగడం వలన దూడలు చనిపోతాయి.


గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న సిబ్బంది (ఫైల్)

పాడి పంట

గాలికుంటు వ్యాధి చికిత్స..

- నోరు, పెదాలు, నాలుక, చన్నులు, కాళ్ల గిట్టల మద వచ్చిన పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ లేదా నార్మల్ సెలైన్ నీటితో పరిశుభ్రంగా కడగాలి.
- కాళ్ల గిట్టల మధ్య పుండ్లను నీటితో కడిగిన తర్వాత ఆరనిచ్చి యాంటి సెప్టిక్ లోషన్‌ను రాసి అవసరమైతే ఈగలు వాలకుండా నివారించడానికి కట్టు కట్టించాలి.
- రెండవసారి ఇన్‌ఫెక్షన్ రాకుండా ఉండడానికి యాంటీ బయోటిక్స్ మందులు, పశువులలో వ్యాధి నిరోధక శక్తిని పెంచడానికి బి కాంప్లెక్స్ మందులను వాడాలి.

సకాలంలో టీకాలు వేయించాలి

పశువులు, జీవాల యజమానులు గాలికుంటు వ్యాధి పట్ల నిర్లక్ష్యం చేయకుండా పశువైద్యశాఖ అధికారులు చెప్పిన సమయంలో తప్పనిసరిగా వాటికి టీకాలు వేయించాలి. సంవత్సరంలో రెండుసార్లు టీకాలు వేయించటం వలన వ్యాధి సోకే ప్రమాదం ఉండదు. గాలికుంటు వ్యాధి ప్రాణాంతకమైన వ్యాధి కావడం వలన దీనిని నిర్లక్ష్యం చేస్తే పశువులు మరణించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఎప్పటికప్పుడు యజమానులు వాటి ఆరోగ్య పరిరక్షణ చూసుకుంటూ ఉండాలి.

పాటించాల్సిన జాగ్రత్తలు

- గాలికుంటు వ్యాధి సోకిన పశువులను మందలో ఉంచకుండా వేరేగా కట్టేయాలి.
- పశువుల పాకను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఎప్పటికప్పుడు నీరు చల్లి వారానికి ఒకసారి సున్నం చల్లిస్తుండాలి.
- వ్యాధి సోకిన పశువులకు వాడిన పరికరాలను పాకలో ఉంచకుండా దూరంగా పడేయాలి. పాకలో ఉంచడం వలన ఈ వ్యాధి ఇతర పశువులకు సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.
- జబ్బు చేసిన పశువు నుంచి తీసిన పాలను 100 డిగ్రీల సెల్సియస్ వరకు వేడి చేసుకుని తాగాలి.
- పశువులను మేతకు తోలుకెళ్లినప్పుడు అక్కడ కుంటలలో నిల్వ ఉన్న నీటిని తాగకుండా జాగ్రత్త వహించాలి.
- వ్యాధి సోకి పశువు చనిపోతే దానిని గోతిలో వేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి పాతిపెట్టాలి.
- చల్లని తాగునీరు పశువులకు అందించడం వలన పాల దిగుబడి బాగా ఉండటంతో పాటు పశువులు ఆరోగ్యంగా ఉంటాయి. తద్వారా వ్యాధులు రాకుండా నివారించుకోవచ్చు.